క్లుప్తంగా

పరామర్శ

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల కేంద్రంతోపాటు, తిరుమలగిరి, రామప్పగూడెంతండాలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన రొంటాల రాజయ్య, మష్క మధుకర్, బక్కతట్ల రజిత, రేసోజు జయప్రద, ఏదుల సమ్మయ్య, మాచర్ల వెంకటేష్, బానోతు నర్సమ్మ కుటుంబ సభ్యులను బుధవారం భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు పరామర్శించి, మృతుల చిత్ర పటాల వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, మండల నాయకులు గూటోజు కిష్టయ్య, తదితరులు ఉన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మోరె హంసరెడ్డి, బండారి నిఖిల్, గడ్డం హరికృష్ణ, ఇప్పకాయల స్వామి, రేణుకుంట్ల రామమ్మ ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

కస్తూర్బా స్కూల్‌లో పనుల పరిశీలన

మొగుళ్లపల్లి: మండలంలోని కోర్కిశాల గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో నూతనంగా నిర్మించిన అకాడమీ బ్లాక్, స్టేజీని బుధవారం జెడ్పీటీసీ జోరుక సదయ్య పరిశీలించి, మాట్లాడారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అకాడమీ బ్లాక్‌ను, స్టేజిని శనివారం ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. వంట గదిని, పరిశీలించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం మండల ఉపాధ్యక్షుడు దానబోయిన రాములు, పాశం స్వరూప, గుంటి లక్ష్మి, ఉప సర్పంచ్ మంద సంజీవరెడ్డి, పర్వతాలు, రవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిట్యాల: ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చిట్యాల ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ బుర్ర సదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాలు నిండి, ఎలాంటి విద్యార్హత లేకున్నా 10వ తరగతిలో ప్రవేశం పొందవచ్చని, 10వ తరగతితో ఇంటర్‌లో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ఆసక్తిగలవారు ఓపెన్ స్కూల్‌ను వినియోగించుకోవాలని, మరిన్ని వివరాలకు 94900 05525 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సమ్మె విరమణ

మల్హర్: పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెను తాత్కాలికంగా విరమించినట్లు కారోబార్ సంఘం మండల అధ్యక్షుడు కనుకుల శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు సమ్మె విరమణ పత్రాన్ని అందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నారా శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మోరంచపల్లిలో పశువుల దాణా పంపిణీ



భూపాలపల్లి రూరల్: వరద ముంపునకు గురైన మోరంచపల్లి గ్రామంలో హ్యూమన్ సొసైటీ ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వరంగల్ సహకారంతో వరద బాధిత కుటుంబాలకు చెందిన పశువుల కోసం 80క్వింటాళ్ల దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కమలబాయ్ వెంకన్న, గ్రామస్తులు నూకల నర్సింహారెడ్డి, గోపాలమిత్ర సూపర్ వైజర్ నూకల ప్రకాష్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పెంచాలి

భూపాలపల్లి అర్బన్: గృహలక్ష్మి దరఖాస్తుల గడువును పొడిగించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్‌నాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కులం, ఆదాయం, నివాసం ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా..ఇప్పటికీ సర్టిఫికెట్లు రావడం లేదన్నారు. రేషన్ కార్డు ప్రమాణికంగా లబ్ధిదారులకు ఎంపిక చేస్తున్నామంటున్న ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో గృహలక్ష్మి పథకానికి దూరం చేస్తుందన్నారు. దరఖాస్తుల గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు.

సెల్‌ఫోన్ అందజేత

టేకుమట్ల: రాఘవాపూర్ గ్రామానికి చెందిన బొమ్మ ప్రకాష్ ఇటీవల తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకోగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. కాగా, సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా మొబైల్ ఫోన్‌ను గుర్తించి బుధవారం ఎస్సై గట్ల సుధాకర్ బాధితుడికి అప్పగించారు. ఆయన వెంట కానిస్టేబుళ్లు మధుకర్, రంజిత ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



మొగుళ్లపల్లి: బియ్యం పంపిణీ చేస్తున్న మధుసూదనాచారి



భూపాలపల్లి రూరల్ : బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న అధికారులు

మొగుళ్లపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చలివాగు ఉప్పొంగి మండలంలోని అంకుషాపూర్ గ్రామంలోని ఇళ్లలోకి వరద పోయి సర్వం కోల్పోయిన బాధితులకు బుధవారం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి 25 కిలోల చొప్పున బియ్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివిధాలా అందుకుంటుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో వివిధ కారణాలతో మృతిచెందిన మోరే హంస రెడ్డి, బండారి అఖిల్ కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చదువు అన్నా రెడ్డి, ఉపాధ్యక్షుడు దానబోయిన రాములు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ఎర్రబెల్లి పున్నం చందర్‌రావు, కోడారి రమేష్, నాయకులు ఉన్నారు.

వరద బాధితులకు అండగా 'సిరికొండ'

టేకుమట్ల: మండలంలోని కుందనపల్లి, సుబ్బక్కపల్లిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదల్లో చిక్కుకుని నిత్యావసర సరుకులతో పాటు ఇండ్లను కోల్పోయిన వరద బాధితులకు బుధవారం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించి, బియ్యంతోపాటు నిత్యావసర సరుకులను అందించారు. టేకుమట్ల మండల కేంద్రంతోపాటు రాఘవరెడ్డిపేటలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన తుమ్మల సుగుణమ్మ, గొల్లపెల్లి కొమురయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చలివాగు పరివాహక ప్రాంతాల్లో ఇటీవల వరదలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులు కత్తి సంపత్‌గౌడ్, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, సర్పంచ్‌లు గునిగంటి మహేందర్, ఉమేందర్, ఉద్దమారి మహేష్, వెలిశెట్టి సురేష్, చిట్యాల సారయ్య, చింతలపెల్లి స్వామిరావు, కొలిపాక రాజయ్య, నేరేళ్ళ శ్రీనివాస్, నామని రాజేందర్, వంగ రాంబాబు, వంగ కుమారస్వామి, పసరగొండ లక్ష్మన్, తదితరులు ఉన్నారు.

ఖాతాదారులకు సరుకుల పంపిణీ

భూపాలపల్లి రూరల్ : వరద బీభత్సంతో సర్వం కోల్పోయిన భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామ వరద బాధితుల్లో పిన్‌కేర్ బ్యాంకు ఖాతాదారులకు బ్యాంక్ అధికారులు బుధవారం బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా బ్యాంకు ఆర్‌ఎం సత్యం మాట్లాడుతూ.. వరదలకు సర్వం కోల్పోయిన గ్రామస్తులకు అందరు అండగా ఉండి ఆదుకోవాలన్నారు. బ్యాంకు జోనల్‌హెడ్ వెంకటరత్నం, డీఎం సతీష్‌కుమార్ ఆదేశానుసారం బాధిత ఖాతాదారులకు సహకారాన్ని అందించినట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌లో సీఎంపీఎఫ్ చిట్టీలు



మాట్లాడుతున్న రీజనల్ కమిషనర్

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల సీఎంపీఎఫ్ వివరాలను ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్లు సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరి పచౌరీ తెలిపారు. ఏరియాలోని జీఎం కార్యాలయంలో బుధవారం సీఎంపీఎఫ్ త్రైపాక్షిక సమావేశం, పెన్షన్ అదాలత్ కార్యక్రమం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎంపీఎఫ్ రీజనల్ కమిషన్ హరి పచౌరీ హాజరై కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడారు. ఇప్పటి వరకు సీఎంపీఎఫ్ వివరాలకు సీఎంపీఎఫ్ చిట్టీలు వచ్చే వరకు ఎదురు చూసేదన్నారు. ఇక నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను తయారు చేసి ఉద్యోగులందరికీ అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకటయ్య, కవీంద్ర, తుకారాం, డాక్టర్ సురేష్, సురేఖ, కార్మిక సంఘాల నాయకులు బడితెల సమ్మయ్య, రమేష్, జోగు బుచ్చయ్య, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

అమరుల త్యాగఫలమే క్విట్ ఇండియా ఉద్యమం



జెండావిష్కరణ చేస్తున్న ప్రకాష్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్: మహాత్మాగాంధీ, నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ త్యాగఫలమే క్విట్ ఇండియా ఉద్యమమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఐత ప్రకాష్‌రెడ్డి హాజరై జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఆనాడు బ్రిటిష్ వారిని తరిమికొట్టడానికి క్విట్ ఇండియా ఉద్యమం దోహదపడిందని, నేడు బీజేపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టడానికి రాహుల్ గాంధీ జోడోయాత్ర ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, ఎస్టీ సెల్ జిల్లా విభాగం చైర్మన్ పోరిక సమయ్య, గద్దె సమ్మిరెడ్డి, స్వప్న రెడ్డి, అజ్మీరా జంపన్న, ఎంపీపీలు పంతకాని సమ్మయ్య, మల్హర్ రావు, వెంపటి భువన సుందర్, రాజబాబు నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు



వినతిపత్రం అందజేస్తున్న రేషన్‌డీలర్లు

మొగుళ్లపల్లి: ఇటీవల నూతనంగా వచ్చిన తహసీల్దార్ రాణిని మండలంలోని రేషన్‌డీలర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వక కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు నిమ్మల భద్రయ్య మాట్లాడుతూ డీలర్లు పోర్టేబుల్లిటి ఉండడం వల్ల ప్రతి డీలర్ నుంచి 20నుంచి 30 కింటాళ్ల బియ్యం నిల్వలు ఉంటున్నాయని తెలిపారు. బియ్యం నిల్వలు ఉండడం వలన పందికొక్కులు ఎలుకలు చేరి బియ్యం సంచులు కొడుతున్నాయని బియ్యం తరుగు రావడమే కాకుండా సంచులు చినిగిపోయి పనికిరాకుండా పోతున్నాయన్నారు. పోర్టేబుల్లిని తీసేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్లు సకాలంలో బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు గడ్డం రాధాకృష్ణ కిషన్, రాజేందర్ వినోద, లక్ష్మి, ప్రభాకర్, రాంరెడ్డి, సునీత ఉన్నారు.

తరగతులు నిర్వహించాలని ఆందోళన



రహదారిపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కాటారం: కాటారం మండల కేంద్రంలోని బాబు పారామెడికల్ కళాశాలలో సరైన వసతులు లేకపోవడంతో పాటు తరగుతులు సక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపిస్తూ బుధవారం కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు కాటారం- మంథని రహదారిపై కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థుల గూర్చి కళాశాల యజమాన్యం పట్టించుకోవడం లేదని తరగతులు నిర్వహించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. యజమాన్యాన్ని అడిగిన స్పందించడం లేదని విద్యార్థులు పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనకు ఎస్‌ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. అటువైపుగా వెళ్తున్న పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి, ఆందోళన చేస్తున్న సమాచారం అందుకున్న ట్రైనీ ఎస్సై ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల యజమాన్యంతో మాట్లాడి తరగతులు సరిగా నిర్వహించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ విషయమై కళాశాల కరస్పాండెంట్ తాటి శ్రీనివాస్‌ను వివరణ కోరగా కళాశాలను నూతన భవనంలోకి మార్చే ప్రక్రియలో తరగతుల నిర్వాహణ కొంత ఆలస్యం జరిగిందన్నారు. విద్యార్థులు నరేశ్, మనీష, స్మరణ్, కిశోర్, తరుణ్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ పాత్ర కీలకం

● గండ్ర సత్యనారాయణ రావు



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ యువజన నాయకుల పాత్ర కీలకమని టీపీసీసీ సభ్యులు, భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డీసీసీ ప్రెసిడెంట్ అయిత ప్రకాష్ రెడ్డితో పాటు భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలను యువత అందరికీ చేర్చాలని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి యువత కృషి చేయాలని తెలిపారు. అంతకుముందు భూపాలపల్లి పట్టణంలోని 5 ఇంక్లైన్ కమాన్ నుంచి ప్రొఫెసర్ జయశంకర్ సార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జంక్షన్ మీదుగా హనుమాన్ టెంపుల్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను యువజన కాంగ్రెస్ జిల్లా ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ ఆవిష్కరించారు. టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, ఇస్లావత్ దేవన్, కౌన్సిలర్ శ్రీనివాస్, బుర్ర కొమురయ్య, శ్రీనివాస్, రాజేందర్, మహేందర్, రంజిత్ నాయకులు పాల్గొన్నారు.

టేకుమట్ల: యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు టౌన్ అధ్యక్షుడు కొలుగూరి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జెండా ఆవిష్కరించి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్ హాజరై మాట్లాడారు. దేశంలో ఎంతో మంది నాయకులు యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చిన వారేనని, నేటి సీఎం కేసీఆర్ నుంచి చంద్రబాబునాయుడు వరకు యూత్‌కాంగ్రెస్‌లో ఓనమాలు దిద్దినవారేనన్నారు. భవిష్యత్‌లో మరెంతో మంది యువ నాయకులు ఉద్భవిస్తారని, అందుకు యూత్ కాంగ్రెస్ ప్రధానంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మండల యూత్ నాయకులు నాగుల నరేందర్, నూనేటి రమేష్, బొండ్ల మహేష్, కొడగాని అనిల్, రాజేష్, రాకేష్, పవన్, వివేక్, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్

కాటారం: కాటారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో బుధవారం యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ జెండా ఎగరవేసి కేక్ కట్ చేశారు. నాయకులు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మహేశ్వరీ, గద్దె సమ్మిరెడ్డి, విక్రమ్, కిరణ్, నరేశ్, ఉమాశంకర్, అశోక్, కోడి రవికుమార్, చీమల రాజు, కొట్టె ప్రభాకర్, దేవేందర్‌యాదవ్ పాల్గొన్నారు.



మహాముత్తారంలో..

మల్హర్(మహాముత్తారం): మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను యువజన కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు జాటోత్ వంశీరాజ్ ఆధ్వర్యంలో యూత్ జెండాను ఎగురవేశారు. కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. వంశీరాజ్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావాల్సిన బాధ్యత యువజన కాంగ్రెస్ నాయకులపై ఉందన్నారు. కోఆప్షన్ సభ్యుడు నజీర్ ఖాన్, మహాముత్తారం టౌన్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి సుధాకర్, ఉప సర్పంచ్ మధుకర్, మండల యూత్ ఉపాధ్యక్షుడు అశోక్, ప్రసాద్, రాజయ్య, రమేష్, రవీందర్, కౌశిక్, సుమన్ పాల్గొన్నారు.

'మోరంచపల్లి' బాధితులకు సాయం అందించాలి

● ధర్మ సమాజ పార్టీ ఆధ్వర్యంలో ప్రారంభమైన రిలే నిరాహార దీక్ష



దీక్ష చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

భూపాలపల్లి రూరల్: మోరంచపల్లి వరద బాధితులకు ప్రభుత్వం తక్షణం రూ.లక్ష సాయం అందజేసి ఆదుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మోరంచపల్లి వరద బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలో భూపాలపల్లి జిల్లా ప్రచార కమిటీ నాయకులు కూర్చోగా ముఖ్య అతిథులుగా బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమనాథుని సత్యనారాయణ, గొర్ల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాకోటి ఓదెలు, ఐఎఫ్‌టీయూ నాయకులు బుర్రి కుమారస్వామి దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మేకల సుమన్ రాష్ట్ర నాయకులు సాయిబాబా, రాజేష్, రత్నాకర్, రాజు పూలమాల రూప పాల్గొన్నారు. టీపీపీపీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణ రావు రిలే దీక్షలకు మద్దతు తెలిపారు. ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు రమేష్, రవీందర్, రవి, రాజ్‌కుమార్, రాజేష్, రత్నాకర్, ప్రవీణ్, అశోక్, జితేందర్, శ్యామ్, నరసింహ, ఓంకార్, రాజు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో 'మేరా మిట్టి- మేరా దేశ్'



మొక్కలు నాటుతున్న జవాన్‌లు, విద్యార్థులు

భూపాలపల్లి రూరల్: మండలంలోని కమలాపూర్ గ్రామంలో 75 సంవత్సరాల స్వాతంత్ర్యంలో భాగంగా బుధవారం ఎన్‌వైకే 58 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్, కాకతీయ యూనివర్సిటీ, పంచాయతీ రాజ్ అండ్ డెవలప్‌మెంట్, కేంద్ర సమాచార, ప్రసార శాఖ సంయుక్తంగా 'మేరా మిట్టి- మేరా దేశ్' కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా మనం ఉండే మట్టిని తలుచుకుంటూ పదవీవిరమణ పొందిన జవాన్లు, వారి కుటుంబ సభ్యులను స్మరించుకున్నారు. అనంతరం మొక్కలు నాటి, మాతృభూమి కోసం గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం భారత సైన్యంలో సేవలందించి వీరమరణం పొందిన కమలాపూర్ గ్రామ నివాసి అజ్మీర నరహన్ సతీమణి విమలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ కేంద్ర యూత్ ఆఫీసర్ అన్వేష్, కాకతీయ యూనివర్సిటీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, సీఆర్‌పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ బూరాలాల్ మీనా, కేంద్ర సమాచార ప్రసార శాఖ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్, భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సంధ్యారాణి, సర్పంచ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఆదివాసీలకు న్యాయం



నందిగామలో నిద్రిస్తున్న సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: ఆదివాసీ, గిరిజనులకు బీఆర్ఎస్ ప్రభుత్వంతో ఒరిగిందేమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఆదివాసీలకు న్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సత్యనారాయణరావు అన్నారు. బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి మండలం నందిగామ గ్రామంలో రాత్రి గిరిజన, ఆదివాసీ సంరక్షణ హస్తం పేరిట గండ్ర సత్యనారాయణ రావు గ్రామంలోని గిరిజనులతో కలిసి సహపంక్తి భోజ నం చేసి, రాత్రి అక్కడే నిద్రించారు. సుంకరి రామచంద్రయ్య, బుర్ర కొమురయ్య, సంతోష్, శ్రీనివాస్, తిరుపతి, రానా, శ్రీరామ్, రవి, సదానందం, రాజబాబు, వెంకటరాజం ఉన్నారు.

మాదారంలో శ్రీధర్‌బాబు పల్లెనిద్ర

మల్హర్(మహాముత్తారం): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని మాదారం గ్రామంలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం గిరిజనులతో కలిసి పల్లె నిద్ర చేశారు. ముందుగా గిరిజనులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి, వారి సమస్యసలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడారు. గత కాంగ్రెస్ పార్టీ హయంలో గిరిజనుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలనిఅందించి, వారి అభివృద్ధికి తొడ్పడిందని వెల్లడించారు. అనంతరం పీసీసీ సభ్యుడు బెల్లంకొండ కృష్ణయ్య ఇంట్లో నిద్రించారు. డీసీసీ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ శారద, సడవల్లి, రాజబాబు, రమేష్ పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమించాలి



వేడుకల్లో పాల్గొన్న ఆదివాసీ నాయకులు

భూపాలపల్లి రూరల్: ప్రపంచ ఆదివాసులు ఏకమై హక్కుల సాధనకై ఉద్యమించాలని భూపాలపల్లి మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ బద్ది సమ్మయ్య అన్నారు. బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా భూపాలపల్లిలో, మంజూరునగర్, వేషాలపల్లిలో అంగడి పరేడ్ ఘనంగా ఆదివాసీ జెండాలు ఎగురవేశారు. ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం అధ్యర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ బద్ది సమ్మయ్య, ఎంపీటీసీ బొడ్డు సమ్మయ్య, ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం జిల్లా నాయకులు శీలం లక్ష్మయ్య, ముంజం సారయ్యలు హాజరై మాట్లాడారు. ప్రపంచ ఆదివాసులు అందరు ఏకమై ఆదివాసీ హక్కులు, చట్టాల అమలుకై పోరాడాలన్నారు. అత్యధికంగా ఆదివాసులు ఉన్న భూపాలపల్లి జిల్లాలో డీటీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని, మహాదేవపూర్‌లో మాడ కార్యాలయం పునరుద్దరించాలని, భూపాలపల్లిలో గిరిజన ఆశ్రమ హాస్టల్‌కు స్వంత భవనం నిర్మించడంతోపాటు చిట్యాల మండలం నైన్ పాక లో గిరిజన ఆశ్రమ పాఠశాల నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బిసులు లక్ష్మయ్య, సీనియర్ నాయకులు గుంటి మల్లయ్య, గుంటి పోచయ్య, బిముని శరత్, త్రిజేసి వెంకట్రాజం, యూత్ కార్యదర్శి గంట శేఖర్,సంస్కృతిక కార్యదర్శి చింతల లక్ష్మి నారాయణ, కాలీనేని సాంబయ్య, బిముని రమేష్, గంప వెంకటేష్, సారయ్య, మేకల తిరుపతి, లక్ష్మణ్, సదానందం, కిష్టస్వామి, సుధాకర్, మల్లేష్, ముంజం కళ్యాణ్, చింతల బీమయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

మల్హర్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కొయ్యూర్‌లో ఆదివాసీ గిరజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకుడు భాస్కర్ జెండాను ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి రమేష్, సబ్ డివిజన్ ఉపాధ్యక్షుడు గుంటి నాగరాజు, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాక్షుడు కొమరయ్య, శంకర్, రామచంద్రు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మొగుళ్లపల్లి: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ పథకం కింద మొట్లపల్లిలో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అన్నారు. బుధవారం మొట్లపల్లి గ్రామంలో పురోగతిలో ఉన్న ఇంటింటికి ఇంకుడుగుంత, మరుగుదొడ్ల నిర్మాణం పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, ఐకేపీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరహరి పద్మవెంకటరెడ్డి, మండల ప్రత్యేక అధికారి సునిత, ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంపీఓ వీరస్వామి, ఇన్‌చార్జ్ ఏపీఓ రాము, ఏపీఏ రవివర్మ, టెక్నీకల్ అసిస్టెంట్స్ మహేందర్, మానస సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

మొగుళ్లపల్లి: మండలంలోని కొర్కిశాల, ముల్కలపల్లి, గణేష్‌పల్లి, పోతుగల్, ఇస్పలపల్లి గ్రామాల్లో జిల్లా వ్యవసాయశాఖ అధకారి విజయ్‌భాస్కర్ బుధవారం పర్యటించారు. ఆయాగ్రామాల్లో వానాకాలం పంటల విస్తీర్ణం, సాగు వివరాలు, చీడపీడల నివారణకు రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంటల స్థితిగతులను తెలుసుకున్నారు. మండలంలోని పీఏసీఎస్, ఎరువులు, పురుగుమందుల షాపులను తనిఖీని నిర్వహించి, నిల్వల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పి.సురేందర్ రెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మల్హర్: మండలంలోని కొయ్యూరు గ్రామానికి చెందిన బత్తుల మల్లయ్యకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.8వేలు మంజూరయ్యాయి. ఈమేరకు బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం లబ్ధిదారుడికి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాష్‌రావు, సర్పంచ్‌లు సిద్ది లింగమూర్తి, అడ్డూరి కుమారస్వామి, నాయకులు కోట రవి, తాజోద్దిన్, సురేష్‌రెడ్డి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



మల్హర్: మండలంలోని కొయ్యూరు ఇండియన్ బంక్‌లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించేలా సంబంధింత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంక్‌లో వాటర్, కరెంట్, బాత్రూం, లైటింగ్ తదితర వసతులు లేవని, సక్రమంగా పెట్రోల్, డీజిల్‌ను స్టాక్ ఉంచడంలో నిర్వాహకులు విఫలమవుతున్నారని ఆరోపించారు. దీంతో రైతులు, వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని వెల్లడించారు. అధికారులు స్పందించి వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలియజేశారు. కొయ్యూరులో మంజూరైన బంక్‌ను త్వరగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.